క్లుప్తంగా

యువకుల శ్రమదానం



లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట మండల కేంద్రంలో మంగళవారం యువకులు శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. లింగంపేట మండల కేంద్రంలోని ఒకటో వార్డు ప్రధాన వీధుల్లో మురికి కాల్వలు శుభ్రం చేశారు. అలాగే రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. స్వచ్ఛ లింగంపేటగా మార్చడానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రాంతికుమార్, వంశీ, దిలీప్, బాల్‌రాజు, శ్రీనివాస్, సంజయ్, అనిల్, రంజిత్. సాయిలుతో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

ఎంపీ సురేశ్ షెట్కార్‌కు అభినందనలు



ఎల్లారెడ్డి: జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీగా గెలుపొందిన సురేశ్ షెట్కార్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అభినందనలు తెలిపారు. సంగారెడ్డిలో సురేశ్‌షెట్కార్‌ను కలిసి శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

సమష్టి కృషితోనే గెలుపు సాధ్యం



నిజాంసాగర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషితోనే జహీరాబాద్ గడ్డపై హస్తం జెండా ఎగుర వేశామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీకాంతారావు గెలుపు పట్ల మంగళవారం కార్యకర్తలు, నాయకులతో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మల్లికార్జున్, రాముురాథోడ్ తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలం హాజీపూర్‌తండాకు చెందిన సంగ్రాంకు సెల్‌ఫోన్‌ను అందించినట్లు ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. సంగ్రాం గత రెండు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందించినట్లు ఎస్సై తెలిపారు.

నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మకు బోనాలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని కాటేపల్లి గ్రామంలో నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామ శివారులో ఉన్న నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ దేవతలకు బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలు తీశారు.

ఎమ్మెల్యే పర్యటనను సక్సెస్ చేయాలి



దోమకొండ : రైతు కల్లాల ఏర్పాటు కోసంఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బుధవారం మండల కేంద్రానికి వస్తున్నారని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి అన్నారు. నేడు మండల కేంద్రంలో మధ్యాహ్నం 3 గంటలకు పర్యటన ఉంటుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్‌రెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, కంది మనోజ్‌కుమార్, శ్రీనాథ్, సంతోష్, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ సంబురాలు



సురేశ్ షెట్కార్‌తో పట్టణ కాంగ్రెస్ నాయకులు



లింగంపేటలో..



దోమకొండలో..



అంకోల్‌లో..



బిచ్కుందలో..



మద్నూర్‌లో..



పిట్లంలో..

జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీగా సురేశ్‌షెట్కార్ విజయం సాధించడంతో జిల్లావ్యాప్తంగా మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. కార్యకర్తలు పటాకులు కాల్చి, స్వీట్లు పంచారు. – సాక్షి నెట్‌వర్క్



జహీరాబాద్ ఎంపీగా గెలిచిన సురేశ్ షెట్కార్‌ను సన్మానిస్తున్న భిక్కనూరు మండల కాంగ్రెస్ నేతలు



భిక్కనూరులో..



ఎల్లారెడ్డిలో..



కొత్తాబాది గ్రామంలో..



పెద్దకొడప్‌గల్‌లో..



మాచారెడ్డిలో..



తుంకిపల్లి తండాలో..



నాగిరెడ్డిపేటలో..



బాన్సువాడలో..



సురేశ్ షెట్కార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సౌదాగర్ అరవింద్



తాడ్వాయిలో..

కదిలిన వైద్యయంత్రాంగం



హన్మాజీపేట్‌లో రోగులతో మాట్లాడుతున్న వైద్యబృందం



ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

- హన్మాజీపేట్‌లో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు
- దోమల నివారణ మందు పిచికారి

సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ రూరల్ : 'మంచం పట్టిన హన్మాజీపేట్' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ స్పందించారు. హన్మాజీపేట్ పీహెచ్‌సీ సిబ్బందిని అప్రమత్తం చేసి గ్రామంలో విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుని అనంతరం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్‌కు నివేదిక సమర్పించారు. మంగళవారం హన్మాజీపేట్ గ్రామంలో డాక్టర్ సమీఉల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 64 మంది జ్వరపీడితులను పరీక్షించి మందులు అందజేశారు. అలాగే హెచ్‌ఈవో సాయిలు, సబ్‌యూనిట్ ఆఫీసర్ దయానంద్ పర్యవేక్షణలో ఇంటింటి జ్వర సర్వే చేయించారు. 'సాక్షి'లో ప్రచురితమైన ఫొటోల ఆధారంగా బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. 26 మంది జ్వరపీడితులకు కామారెడ్డిలోని టీహబ్‌లో రక్తపరీక్షలు చేయించారు. అలాగే గ్రామంలో దోమలు వృద్ధి చెందకుండా మురికికాలువల్లో, జ్వరబాధితుల ఇళ్లలో దోమల నివారణ మందు పిచికారి చేయించారు.

పారిశుధ్యలోపంపై ఫిర్యాదు

హన్మాజీపేట్ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ బాగాలేదని, మురికి కాలువల గుండా మంచినీటి పైప్‌లైన్ ఉండటంతో తాగునీరు కలుషితం అవుతున్నాయని అధికారులు జిల్లా వైద్యాధికారికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు.

గత కొన్ని నెలలుగా గ్రామానికి సరఫరా అయ్యే మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేయించకపోవడంతో పాటు నిత్యం క్లోరినేషన్ జరగడం లేదని నివేదిక ఇచ్చారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి గ్రామంలో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. కనీసం తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కణకు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'సాగర్' ప్రధాన కాలువకు బుంగ

- వేలాది క్యూసెక్కుల నీరు వృథా
- బుంగను పరిశీలించిన ఎస్‌ఈ
- ప్రధాన కాలువకు నీటి నిలిపివేత



ప్రధాన కాలువకు బుంగ ఏర్పడడంతో వృథా అవుతున్న నీరు

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్రం శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువకు మంగళవారం మధ్యాహ్నం బుంగ పడింది. దీంతో వందలాది క్యూసెక్కుల నీరు వృథా అయ్యింది. నిజామాబాద్, బోధన్ పట్టణ ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 1,100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. అయితే మహమ్మద్‌నగర్ శివారులో డిస్ట్రిబ్యూటరీ–2 సమీపంలో ప్రధాన కాలువ కట్టకు మంగళవారం బుంగ పడింది. ఆ ప్రాంతంలో పశువులను మేపుతున్న స్థానిక రైతులు దీనిని గమనించి నీటి పారుదలశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే బుంగ ద్వారా వందలాది క్యూసెక్కుల నీరు బయటకు వచ్చి సమీపంలోని భూములను ముంచెత్తింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను నిలిపి వేశారు. సాయంత్రానికి ప్రధాన కాలువలో నీరు తగ్గుముఖం పట్టింది. బాన్సువాడ నీటిపారుదల శాఖ ఎస్‌ఈ వాసంతి, ఏఈలు శివకుమార్, భూమన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ బుంగను పరిశీలించారు. ప్రధాన కాలువకు ఏర్పడిన బుంగ వద్ద ఇసుక బస్తాలను అడ్డుగా వేసి తాత్కాలికంగా బండ్‌ను ఏర్పాటు చేయాలని ఎస్‌ఈ వాసంతి అధికారులను ఆదేశించారు. దీంతో నీటిపారుదలశాఖ అధికారులు బుంగకు తాత్కాలికంగా అడ్డుకట్ట వేసే పనిలో నిమ్నగమయ్యారు.

అప్పుడు కాంగ్రెస్‌కు.. ఇప్పుడు బీజేపీకి..

- భిక్కనూరులో మారిన సమీకరణాలు

భిక్కనూరు : భిక్కనూరు మండలంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యాన్ని ఇచ్చిన ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ వైపు మొగ్గు చూపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భిక్కనూరు మండలంలో బీజేపీ పార్టీ తన ఆధిక్యాన్ని చాటుకుంది. మంగళవారం ఎంపీ ఎన్నికల ఫలితాల్లో భిక్కనూరు మండలంలో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు 12,914 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ శెట్కార్‌కు 11,468 ఓట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు 5059 ఓట్లు వచ్చాయి. దీంతో బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ కంటే 1,446 ఓట్ల మెజార్టీ సాధించాడు. గత డిసెంబర్‌లో వెలువడిన అసెంబ్లీ ఫలితాల్లో భిక్కనూరు మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్ రెడ్డి 11289 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వెంకటరమణరెడ్డి 9,899 ఓట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్ 9,798 ఓట్లు సాధించాడు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్ రెడ్డి, తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి వెంకటరమణరెడ్డి పైన 1390 ఓట్ల అధిక్యత సాధించారు. గడిచిన ఆరు నెలల్లో ఈ పార్లమెంట్ ఎన్నిల్లో భిక్కనూరు మండలంలో బీజేపీ తన ఆధిక్యతను చాటుకుంది. మండలంలో బీజేపీకి పేరున్న నాయకులు లేనప్పటికీ ప్రధాని మోదీపై ఉన్న ఆదరణే ఓట్లుగా మార్చిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీఆర్‌ఎస్ అడ్డగా పేరున్న బస్వాపూర్‌లో కూడా బీజేపీ ఎనిమిది ఓట్ల ఆధిక్యతను సాధించింది. ఇక్కడ బీజేపీకి 939 ఓట్లు రాగా కాంగ్రెస్ 931, బీఆర్‌ఎస్ 593 ఓట్లు సాధించింది. దీన్నిబట్టి చూస్తే బీఆర్‌ఎస్ కార్యకర్తలు అభిమానులు బీజేపీకి ఓట్లు వేసినట్లు అర్థమవుతుంది. మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ మూడో స్థానంలో నిలిచింది. మండలంలో మేజర్ జీపీలైన భిక్కనూరు, జంగంపల్లి, పెద్దమల్లారెడ్డితో పాటు కంచర్ల, భాగిర్తిపల్లి బస్వాపూర్, సిద్ధరామేశ్వరనగర్, మోటాట్‌పల్లి బీజేపీకి మొగ్గు చూపగా లక్ష్మీదేవునిపల్లి, అంతంపల్లి, తిప్పాపూర్, రామేశ్వర్‌పల్లి, కాచాపూర్, అయ్యవారుపల్లి, ఇసన్నపల్లి, మల్లుపల్లి, గుర్జకుంట, ర్యాగట్లపల్లి కాంగ్రెస్ వైపు మొగ్గుచూపాయి.

బాన్సువాడ గ్రామీణంలో మిశ్రమ ఫలితాలు

బాన్సువాడ రూరల్: జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బాన్సువాడ గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మెజార్టీ అందించారు. కొన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థికి కాంగ్రెస్ కంటే ఎక్కువ ఓట్లు లభించాయి. గట్టుమీది గ్రామాలైన హన్మాజీపేట్‌లోని 191,192,193 పోలింగ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు 335 ఓట్లు, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు 502 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షట్కార్‌కు 660 ఓట్లు లభించాయి. అలాగే అవాజ్‌పల్లిలో బీఆర్‌ఎస్‌కు 95, బీజేపీకి 82, కాంగ్రెస్‌కు 83 ఓట్లు లభించాయి. కాద్లాపూర్‌లో మాత్రం బీఆర్‌ఎస్‌కు 37, బీజేపీకి 230, కాంగ్రెస్‌కు 169 ఓట్లు వచ్చాయి. సంగోజీపేట్‌లో బీఆర్‌ఎస్‌కు 154, బీజేపీకి 330, కాంగ్రెస్‌కు 344 ఓట్లు లభించాయి. మండలంలోని కొల్లూర్‌లో బీఆర్‌ఎస్‌కు 207 ఓట్లు, బీజేపీకి 143,కాంగ్రెస్‌కు అధికంగా 390 ఓట్లు వచ్చాయి. నాగారంలో మాత్రంలో బీఆర్‌ఎస్‌కు 92,ఓట్లు బీజేపీ అత్యధికంగా 291ఓట్లు,కాంగ్రెస్‌కు కేవలం 66ఓట్లు ఓట్లు లభించాయి. ఇలా గ్రామాల్లో మిశ్రమ ఫలితాలు లభించాయి.

ఆధ్యాత్మికం

కాలభైరవుడికి పూలతో అలంకరణ



రామారెడ్డి : ప్రముఖ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీ ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి ఆలయంలో వైశాఖమాసం చివరి మంగళవారం సందర్భంగా కాలభైరవుడికి 108 రకాల పూలతో అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు కాలభైరవానికి జలాభిషేకాలు సింధూర పూజలు నిర్వహించి మధ్యాహ్నం నైవేద్యం సమర్పించి, భజన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు గుప్తా, అర్చకులు శ్రీనివాస్ శర్మ వంశీ వృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్ నాగరాజ్ పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు..



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇళ్లలో బోనాలను వివిధ రంగులతో అందంగా అలంకరించారు. అనంతరంగా డప్పు వాయిద్యాలతో బోనాలను గ్రామంలో కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారి గుండా గ్రామ దేవతలు ఆలయాల వద్ద వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగాపండాలని గ్రామదేవతలను కోరుకున్నారు.

ప్రభుత్వ కళాశాలలో వసతులు శూన్యం

- వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- ఫెయిల్ అవుతున్న విద్యార్థులు
- సమస్యల వలయంలో బీబీపేట నూతన జూనియర్ కళాశాల



బీబీపేట జూనియర్ కళాశాల

బీబీపేట : మండలంలో కొత్తగా ఏర్పాటైన జూనియర్ కళాశాల సమస్యల వలయంలో చిక్కుకుంది. సరైన బోధన సిబ్బంది, కళాశాలకు భవనం లేకపోవడం తదితర కారణాల చేత ఉత్తీర్ణులు అవ్వాల్సిన విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారు. బీబీపేట మండలంలో గతేడాది జూలై 8వ తేదీన నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో 45 మంది విద్యార్థుకు అడ్మిషన్ ఇచ్చారు. అయితే అధ్యాపకులను కేటాయించకపోవడంతో దాతల సహకారంతో నలుగురు ప్రైవేట్ లెక్చరర్లను నియమించారు. కాని కళాశాలకు మొత్తంగా 12 మంది లెక్చరర్లు కావాల్సి ఉండగా నలుగురుతో కష్టంగా నెట్టుకొచ్చారు. కాని పూర్తిస్థాయి అధ్యాపకుల్లేక సరైన విద్యార్థులు శ్రద్ధ పెట్టకపోవడంతో 45మందిలో ఒక్కరు కూడా ఉత్తీర్ణత కాలేదు. కళాశాల ప్రారంభించినప్పుడు వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులను తీసుకొచ్చి బోధన చేయించిన ఉన్నతాధికారులు అక్కడ పూర్తిస్థాయిలో లెక్చరర్ల నియామకానికి చర్యలు తీసుకోలేదు. సరైన సిబ్బంది కూడా లేక కళాశాలలో ఇబ్బందిగా మారింది. కొత్తగా విద్యార్థి అడ్మిషన్ కోసం వస్తే అడ్మిషన్ తీసుకునే నాథుడే లేకుండా పోయారు. లెక్చరర్లను నియమించి, ఒకేషనల్ కోర్సులను తీసుకొస్తే విద్యార్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశముందని విద్యార్థుల తల్లి దండ్రులు పేర్కొంటున్నారు.

లెక్చరర్లు లేరు..



బీబీపేటలో నూతనంగా కళాశాల ఏర్పడడంతో అప్పటికే ఇతర కళాశాలలో అడ్మిషన్ పొందాను. కాని అన్ని సబ్జెక్టులు ఒకే తరగతిలో బోధించడంతో ఏమీ అర్థకాని పరిస్థితి ఉంది. కొత్త భవనం సరిపడా లెక్చరర్లు ఉంటే ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది.

– పవన్, ఎంపీసీ విద్యార్థి

వసతుల లేమి నిజమే..



దోమకొండ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న నన్ను బీబీపేట కొత్త కళాశాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించారు. కళాశాలకు సిబ్బంది కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. సరిపడినన్ని తరగతులు లేకపోవడం, కనీసం అటెండర్ కూడా లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు ఈ నూతన కళాశాలపై దష్టి సారిస్తే తప్ప విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దలేం.

– జైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్, బీబీపేట

కల్లాలను నిర్మించి తీరుతాం

మాచారెడ్డి/దోమకొండ/రామారెడ్డి : కామారెడ్డి నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో రైతు కల్లాలను నిర్మించి తీరుతామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అక్కాపూర్, లచ్చాపేట, మాచారెడ్డి, లక్ష్మీరావులపల్లి గ్రామాలతో పాటు పాల్వంచ మండలం ఎలుపుగొండ, బండ రామేశ్వరపల్లి, ఫరీదుపేట గ్రామాల్లో, దోమకొండ మండలంలోని అంబారిపేట గ్రామంలో, రామారెడ్డి మండలం మద్దికుంట, రెడ్డిపేట, అన్నారం గ్రామాల్లో రైతుకల్లాల ఏర్పాటుపై రైతులతో చర్చించారు. కల్లాలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలం లేని యెడల ప్రైవేట్ వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి నిర్మిస్తామన్నారు. ఆయన వెంట మాచారెడ్డి, పాల్వంచ మండలాల బీజేపీ అధ్యక్షులు బూస సురేష్, అనిల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహచారి, దోమకొండ బీజేపీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్‌రెడ్డి, పార్టీ మండల నాయకులు నీలా సిద్ధు, బస్వాపురం సాయికుమార్, నీల దేవరాజ్, కుంట దేవరాజ్, కోమటి దేవరాజ్, దండవుల వెంకట్, మద్దికుంట బీజేపీ నాయకులు మహేష్, బ్రహ్మచారి, నవీన్, కౌన్సిలర్లు పంద్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

స్నేహితుడి కుటుంబానికి ఆసరా



బాన్సువాడ రూరల్ : మండలంలోని హన్మాజీపేట్ గ్రామానికి చెందిన కుమ్మరి సాయిరాం ఇటీవల మృతి చెందారు. దీంతో సాయిరాంతో పాటు 10వ తరగతి వరకు చదువుకున్న 2005 బ్యాచ్ మిత్రులు మృతుని కుటుంబానికి ఆసరాగా నిలువాలని వాట్సాప్‌లో విరాళం సేకరించారు. మిత్రబృందం సేకరించిన రూ. 20 వేల నగదును కుటుంబ సభ్యులకు అందించారు. పిల్లల చదువుకు కూడా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రంగరిగారి ప్రవీణ్, మోహిన్ తదితరులున్నారు.